స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కౌంటింగ్‌కు భద్రత కట్టుదిట్టం

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వినోద్ కుమార్
- జేఎన్టీయూలో కౌంటింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా కౌంటింగ్ ప్రక్రియ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని, ఇందులో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో సాధారణ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ కోసం అన్ని విధాల సన్నద్ధంగా ఉండాలన్నారు. ఇందుకోసం ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో బ్యారికేడింగ్ పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో బందోబస్తుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వెంటనే ట్రాఫిక్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద రెయిన్ ప్రూఫింగ్ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని రకాల ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేసుకుని కౌంటింగ్ కోసం సర్వం సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జెఎన్‌టియులోని స్ట్రాంగ్ రూముల వద్ద చేపట్టిన ఏర్పాట్లను చూసేందుకు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల కోసం జేఎన్టీయూలో ప్రత్యేకంగా గది ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జెఎన్‌టియులోని హంపి హాస్టల్‌లో అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశామన్నారు. అందులో ప్రత్యేకంగా టీవీలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నోడల్ అధికారులు ఓబుల్ రెడ్డి, అప్పాజీ, డీఎస్పీలు ప్రతాప్, మునిరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుటుంబంపై మృత్యువేట

మరికొద్ది రోజుల్లో వివాహం జరగాల్సిన ఇంట చావుమేళం మోగింది. ఎంతో సంతోషంగా పెళ్లికి కావాల్సిన దుస్తులు కొనుగోలు చేసేందుకు వెళ్లిన వారికి అదే చివరి ప్రయాణం అయ్యింది. రోడ్డు ప్రమాదం రూపంలో ఆ కుటుంబాన్ని మృత్యువు కబళించింది. పెళ్లి కుమారునితో సహా అతని కుటుంబ సభ్యులు ఆరుగురు మరణించారు. మృతులంతా రక్తసంబంధీకులు కావడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శనివారం వేకువజామున అనంతపురం జిల్లా గుత్తి మండలం బాటసుంకులమ్మ ఆలయ సమీపంలో 44వ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అనంతపురం నగరంలోని బిందెల కాలనీకి చెందిన ఆరుగురు మృత్యువాత పడ్డారు.

ప్రమాదంలో మృతి చెందిన వారు

షేక్ ఆలీసాహెబ్

షేక్ జహీదా

షేక్ రెహానాబాను

షేక్‌ఫిరోజ్‌బాషా, షేక్ మొహమ్మద్ ఆహిల్, షేక్ మొహమ్మద్ ఆమన్

- పెళ్లింట విషాదం
- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం
- పెళ్లికుమారునితో సహా రక్తసంబంధీకులంతా మరణం
- మృతులంతా ఒకే కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-గుత్తి

అనంతపురం నగరం బిందెల కాలనీలో నివాసం ఉంటున్న షేక్ అలీ సాహెబ్ రెండవ కుమారుడు షేక్ ఫిరోజ్ బాషాకు వివాహం జూన్ 6వ తేదీన జరగనుంది. వివాహ దుస్తుల కొనుగోలు నిమిత్తం శుక్రవారం నాడు హైదరాబాద్‌కు రెండు కార్లలో కుటుంబ సభ్యులు అందరూ వెళ్లారు. ఒక కారులో షేక్ ఆలీసాహెబ్(58), అతని కుమారుడు, పెళ్లికుమారుడు షేక్‌ఫిరోజ్‌బాషా(28), మనవళ్లు షేక్ మొహమ్మద్ ఆహిల్(6), షేక్ మొహమ్మద్ ఆమన్ (4), తమ్ముని భార్య షేక్ రెహానాబాను(44), పెద్ద కోడలు షేక్ జహీదా(32)తో పాటు మహమ్మద్ గౌస్‌లు వెళ్లారు. అక్కడ దుస్తులు కొనుగోలు చేసి శనివారం వేకువజామున అనంతపురం బయల్దేరారు. శనివారం ఉదయం 6గంటల సమయంలో కారు గుత్తి సమీపంలోని బాటసుంకులమ్మ ఆలయం 44వ జాతీయ రహదారిపై వస్తుండగా డ్రైవింగ్ చేస్తున్న షేక్ మొహమ్మద్ గౌస్ నిద్రమత్తులో కాస్త తూగాడు. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. వేగంగా వస్తూ డివైడర్‌ను ఢీకొనడంతో కారు ఎగిరి కుడి వైపున వస్తున్న లారీని తగిలింది. రెండు వాహనాలు వేగంగా ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న షేక్ అలీసాహెబ్, అతని కుమారుడు షేక్ ఫిరోజ్ బాషా, మనవళ్లు షేక్ మొహమ్మద్ అహిల్, షేక్ మొహమ్మద్ అమన్ తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మరణించారు. షేక్ అలీ సాహెబ్ సోదరుని భార్య ఎస్.రెహానాభాను, కోడలు షేక్ జహీదా, మహమ్మద్ గౌస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ బి.నబీరసూల్ వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎస్.రెహనా భాను మరణించింది. గాయపడ్డ ఎస్.జహీదా, షేక్ మహమ్మద్ గౌస్‌లను మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ జహీదా మరణించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా బాధితుల కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పెళ్లి జరగాల్సిన ఇంట్లో ఇలా మరణాలు సంభవించడం అందరినీ కలిచి వేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాద ఘటనా స్థలంలో కారులోనే మరణించిన షేక్ ఆలీసాహెబ్ కుటుంబ సభ్యులు

అక్షరాస్యత శాతం పెరుగుదలకు కృషి

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లాలో అక్షరాస్యత శాతం మరింత పెంచే దిశగా సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిఇఇ సెట్ - 2024, ఎస్ఎస్ఇ అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఎపిఒఎస్ఎస్ పరీక్షలపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యాశాఖ మరింత కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో బోధించి మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. డిస్ట్రిక్ ఎడ్యుకేషన్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో జిల్లా, రాష్ట్రస్థాయి నిపుణులు ఉండాలన్నారు. పదవ తరగతి, ఇతర పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మరింత పెరగాలన్నారు. రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలు, సాంస్కృతిక, వ్యాసరచన, వక్తృత్వ తదితర ఎలాంటి పోటీలు జరిగినా జిల్లా విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. 8వ తరగతి నుంచే విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇవ్వాలన్నారు. డిఇఇ సెట్, ఎస్-ఎస్ఈ అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఎపిఒఎస్ఎస్ పరీక్షల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్ఎస్ఈ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు, మే - 2024కు సంబంధించి మే 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిఈఈ సెట్ - 2024కు సంబంధించి మే 24వ తేదీన పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, డిఇఒ వరలక్ష్మి, ప్రభుత్వ ఎగ్జామ్స్ అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్, డిఎంహెచ్ఒ డా॥ఈబీదేవి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, లేబర్ డీసీ లక్ష్మీనరసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘటనా స్థలంలో జెసిబిలతో శిథిలాలను తొలగిస్తున్న సిబ్బంది

కూలిన ప్రయివేటు వెంచర్ ఆర్చ్

ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి

అనంతపురం జిల్లా కూడేరు మండలం గొటుకూరు గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న ఓ ప్రయివేటు వెంచర్ ఆర్చ్ కూలింది. ఈ సమయంలో నిర్మాణ పనులు చేస్తున్న ఇద్దరు కూలీలు శిథిలాల కింద పడి మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన ఇద్దరూ మధ్యప్రదేశ్ రాష్ట్రం సుల్కారిక్ గ్రామానికి చెందిన పురాన్ సింగ్ (21), ఆశాక్(22)గా గుర్తించారు. ఇదే ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన తిహార్, అనంతపురం రూరల్ మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన నాగరాజు, ఆంజనేయులు గాయపడ్డారు.

వార్త మెయిన్‌లో

ఎప్పుడేం జరుగుతుందో..?

పోలింగ్ అనంతరం తాడిపత్రిలో రాళ్లు రువ్వుకుంటున్న టిడిపి, వైసిపి మద్దతుదారులు (ఫైల్‌ఫొటో)

- నివురుగప్పిన నిప్పులా తాడిపత్రి
- కత్తిమీద సాములా పోలీసు విధులు
- పోలింగ్ అనంతరం అదుపుతప్పిన శాంతిభద్రతలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఫ్యాక్షన్ ప్రాంతంగా పేరొందిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నికలు అంటనే యుద్ధ వాతావరణాన్ని తలపిస్తాయి. ఎప్పుడు ఎక్కడ ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంటుంది. నివురుగప్పిన నిప్పులా ఉండే ఫ్యాక్షన్ మంటలు ఎన్నికల సమయంలో ఎగిసిపడుతుంటాయి. ఇటీవల కొంతకాలంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలా వరకు ప్రశాంత వాతావరణమే ఉంటూ వచ్చింది. తాడిపత్రిలో మాత్రం అవి అప్పుడప్పుడు ఎగిసిపడుతూనే ఉన్నాయి. అక్కడి టిడిపి నాయకులు జెసి.ప్రభాకర్ రెడ్డి, వైసిపి నాయకులు కేతిరెడ్డి పెద్దారెడ్డిల మధ్య కొన్ని దశాబ్ధాల వైరముంది. ఇవి ఎప్పుడు ఎన్నికలొచ్చినా ఏదో రూపంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంటూనే ఉంటుంది. 2004 సార్వత్రిక ఎన్నికల సమయంలో నామినేషన్ వేసే సమయంలో తాడిపత్రిలో పెద్దఎత్తున ఘర్షణ చోటు చేసుకుంది. అప్పుడు కాంగ్రెస్ పార్టీలో జెసి.ప్రభాకర్‌రెడ్డి ఉండగా, తెలుగుదేశం పార్టీలో కేతిరెడ్డి పెద్దారెడ్డి ఉండేవారు. నామినేషన్ వేసేందుకు జెసి.దివాకర్‌రెడ్డి వెళ్తున్న సమయంలో పరస్పరం బాంబులు వేసుకున్నారు.

జెసి.ప్రభాకర్‌రెడ్డి

కేతిరెడ్డి పెద్దారెడ్డి

2009, 2014లో కేతిరెడ్డి కుటుంబం తాడిపత్రిలో కాకుండా ధర్మవరం అసెంబ్లీపై దృష్టి సారించారు. 2019 ఎన్నికలకు ముందు కేతిరెడ్డి పెద్దారెడ్డి వైసిపి అభ్యర్థిగా తాడిపత్రిలో అడుగు పెట్టే సమయంలోనూ ఉద్రిక్తత పరిస్థితులే నెలకొన్నాయి. వీటి నడుమే 2019 ఎన్నికలు జరిగాయి. తాడిపత్రిలో మూడు దశాబ్ధాలకుపైగా ఓటమన్నది ఎరుగకుండా ఉంటూ వచ్చిన జెసి.కుటుంబం 2019 ఎన్నికల్లో తొలిసారిగా ఓటమిని చవిచూసింది. కేతిరెడ్డి పెద్దారెడ్డి తొలిసారిగా తాడిపత్రి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి ఇక్కడ పట్టుకై పెద్దారెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఓటమితో కోల్పోయిన తమ పట్టును సాధించేందుకు జెసి కుటుంబం సైతం పావులు కదుపుతూనే ఉంది. ఈ తరుణంలోనే గడిచని ఐదేళ్లగా తాడిపత్రి నివురుగప్పిన నిప్పులానే ఉంటూ వచ్చింది. మున్సిపల్ ఎన్నికల సమయంలో పెద్దారెడ్డి నేరుగా జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంటికెళ్లి కూర్చీలో కూర్చోనివచ్చి సవాల్ విసిరారు. ఆ సమయంలోనూ రెండు వైపుల ఉద్రిక్తత పరిస్థితులకు మరింత ఆజ్యం పోశాయి. ఇక మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా టిడిపి అత్యధిక స్థానాలు గెలుపొంది ఛైర్మన్ స్థానాన్ని దక్కించుకుంది. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్‌గా జెసి.ప్రభాకర్‌రెడ్డి అయ్యారు. టిడిపి నుంచి ఛైర్మన్ అభ్యర్థి అయ్యాక ప్రభాకర్‌రెడ్డి, పెద్దారెడ్డిల మధ్య పట్టణంలో ప్రతి విషయంలోనూ వివాదమే చోటు చేసుకుంటూ వస్తోంది. అభివృద్ధికి అడ్డుపడుతున్నారంటూ పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికలు రావడంతో ఆధిపత్యపు పోరు తీవ్ర స్థాయికే చేరింది. ఎన్నికల రోజు ఇవి మరోమారు రాజుకుని మంటలు చెలరేగడానికి కారణమయ్యాయి. ఈ విషయాలను పెద్దగా పరిగణలోకి తీసుకోని పోలీసు అధికార యంత్రాంగం కొంత నిర్లిప్తతతో వ్యవహరించిందన్న విమర్శలున్నాయి. ముఖ్య నేతల కదలికలను గుర్తించడం, వారిని కట్టడి చేసే విషయంలో విఫలవమడంతో మూడు రోజుల పాటు తాడిపత్రిలో యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఇప్పుడు అధికారులపై వేటుపడే దాక వచ్చింది. కొత్త ఎస్పీగా గౌతమి శాలిని నియమించారు. వచ్చిన తక్కువ సమయంలో ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని ఏ మేరకు ఈ ఆధిపత్యపు పోరుకు కట్టడి చేయగలరో చూడాల్సి ఉంది.

తప్పిన ప్రమాదం

కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న ఇల్లు - గూగూడులో ఘటన

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో కుళ్లాయప్పకు చెందిన నిర్మాణంలో ఉన్న ఇల్లు ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. రంగాపురం కుళ్లాయప్ప గూగూడులో ఇల్లు నిర్మాణం చేపట్టాడు. మొదటి అంతస్తు నిర్మాణం పూర్తయింది. తర్వాత రెండో అంతస్తు నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే శనివారం కూడా సుమారు 20 మంది కూలీలతో రెండవ అంతస్తు స్లాబ్ వేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం సమయం కావడంతో కూలీలు భోజనానికి వెళ్లారు. ఈ సమయంలో ఉన్నట్టుండి భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కూలీలు భోజనానికి వెళ్లకుండా ఉంటే భారీ ఎత్తున ప్రాణనష్టం జరిగేదని స్థానికులు అంటున్నారు.

అనంత ఎస్పీగా గౌతమి శాలి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం జిల్లా ఎస్పీగా గౌతమి శాలి నియమితులయ్యారు. 2015 బ్యాచ్‌కు చెందిన గౌతమి శాలి గతంలో కర్నూలు జిల్లా అదనపు ఎస్పీగా పనిచేశారు. ఆ తరువాత విశాఖపట్నం డిసిపిగానూ, విజయనగరంలో 16వ బ్యాటలియన్ కమాండెంట్‌గానూ పనిచేశారు. ఇప్పుడు అనంతపురం జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. జిల్లాలో ఎన్నికల అనంతరం నెలకొన్న పరిణామాల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ముందున్న ఎస్పీ అమిత్ బర్దర్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం తాడిపత్రిలో జరిగిన అల్లర్లను అదుపు చేయడంలో విఫలమయ్యారన్న ఉద్ధేశ్యంతో ఆయన్ను సస్పెండ్ అయ్యారు. ఆ స్థానంలో ఇప్పుడు కొత్త ఎస్పీగా గౌతమి శాలిని నియమించారు.

రాయదుర్గంలో మోస్తరు వర్షం

రాయదుర్గం రూరల్ : రాయదుర్గంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఎండలకు ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కాస్త ఉపశమనం కలిగింది. కాగా పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు, మురుగు కాలువలు నిండి ప్రవహించడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

20న జాబ్‌మేళా

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 20న సోమవారం కియా అనుబంధ పరిశ్రమ సియాన్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తయిన, ఫెయిల్ అయిన వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు పాలిటెక్నికల్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

రోడ్డుకు దగ్గరగా విద్యుత్ స్తంభాలు

త్రీ ఫేస్ పేరుతో ఇబ్బడిముబ్బడిగా చెట్ల నరికివేత-నిబంధనలు పాటించని విద్యుత్ అధికారులు-వాహనదారుల ఇబ్బందులు

రోడ్డుకు ఆనుకుని పూడ్చిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-పుట్లూరు

త్రీఫేస్ విద్యుత్ లైన్ లాగడంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న కరెంటుస్తంభాలను రోడ్డుకు ఆనుకునే పాతుతున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేగాకుండా రోడ్డుకు ఇరువైపులా లాగిన చెట్లను కూడా ఇబ్బడిముబ్బడిగా నరుకుతున్నారు. మండలంలోని ప్రతి గ్రామానికీ త్రీ ఫేస్ కరెంటు ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆర్డీఎస్ స్కీం కింద త్రీ ఫేస్ విద్యుత్ లైన్ లాగుతున్నారు. మండలంలో పుట్లూరు, నాగిరెడ్డిపల్లి, తక్కలపల్లి, వెంకన్నపల్లి, చింతకుంట, కందికాపుల గ్రామాలకు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఆనుకునే విద్యుత్ స్తంభాలను నాటారు. ప్రభుత్వం నిబంధనల మేరకు రోడ్డు నుంచి నాలుగు మీటర్ల దూరంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే నాలుగు అడుగులు కాకుండా రోడ్డుకు ఆనుకునే కరెంటు స్తంభాలను నాటుతున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా ఉపాధి హామీ పథకం కింద రోడ్డుకు ఇరువైపుల నాటిన చెట్లను నరుకుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి నాటిన చెట్లను విద్యుత్ స్తంభాల కోసం నరకడంతో రోడ్లు బోసిపోయాయి. దీనికితోడు ఎప్పుడే జరుగుతుందో అని వాహనదారులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. గతంలో వివిధ ప్రాంతాల్లో కరెంటు వైర్లు తెగి కింద పడటంతో విద్యుదాఘాతానికి గురై పలువురు మృతిచెందిన ఘటనలు ఉన్నాయి.

ఇంతకుమునుపు అగ్రికల్చర్ లైన్ ద్వారానే గ్రామాల్లో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి కరెంటు వదులుతుండేవారు. త్రీ ఫేస్ కరెంటు లేకపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమైందని చెప్పవచ్చు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కొళాయి ఇవ్వాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అలా చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ఆర్డీఎస్ స్రీమ్ కింద ప్రతి గ్రామానికీ త్రీ ఫేస్ కరెంటు లాగుతున్నారు. ఇందులో భాగంగా రోడ్డుకు నాలుగు అడుగులు పాతాల్సిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారులు రోడ్డుకు ఆనుకునే నాటుతున్నారు. ఫలితంగా వాహనదారులు ఇబ్బందులు పడటంతోపాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరుకుతున్నారు. దీంతో పచ్చదనం కనుమరగవడంతోపాటు పర్యావరణం దెబ్బతింటోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు ఆనుకుని నాటిన స్తంభాలను తొలగించి రోడ్డుకు నాలుగు మీటర్ల దూరంలో ఏర్పాటు వాహనదారులు కోరుకుంటున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ డిఇఇ మహేష్‌ని వివరణ కోరగా రోడ్డు పక్కనే పాతకూడదని, అలా కరెంటు స్తంభాలు పాతి ఉంటే పరిశీలించి వెంటనే తొలగిస్తామని తెలిపారు.

ప్రజాశక్తి www.prajasakti.com

డిఎంఎల్‌టి స్టేట్ టాపర్‌గా నితిన్

ప్రజాశక్తి-అనంతపురం

దబ్బర నితిన్‌చౌదరి

ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ నిర్వహించిన పారామెడికల్ కోర్సులోని డిప్లమో ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీలో అనంత యువకుడు దబ్బర నితిన్‌చౌదరి స్టేట్ టాపర్‌గా నిలిచాడు. రాష్ట్రంలో డిఎంఎల్‌టి కోర్సులో 23 మంది డిస్టెంక్షన్‌లో పాసయ్యారు. వీరిలో 9మంది అనంతపురంలోని సీడ్స్ ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థులు ఉండటం గమనార్హమని కళాశాల కరస్పాండెంట్ ప్రత్తిపాటి రంగనాయకులు తెలిపారు. రాష్ట్ర పారామెడికల్ చరిత్రలోనే 84.16 శాతం ఉత్తీర్ణతతో ఎక్కువ మార్కులు సాధించిన నితిన్ ఖ్యాతి పొందాడన్నారు. 2024లో స్టేట్ టాపర్‌గా నితిన్ నిలవడం చాలామందికి స్ఫూర్తిదాయకమన్నారు. స్టేట్ టాపర్ నితిన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కువ మార్కుల సంపాదించడానికి తమ కళాశాల ఉపాధ్యాయులు, కరెస్పాండెంట్ రంగనాయకులు, తల్లిదండ్రులు ప్రోత్సాహమే కారణమన్నారు. ఈమేరకు విద్యార్థిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ కళాశాల కరస్పాండెంట్ రంగనాయకులు, డైరెక్టర్ కార్తీక్, అధ్యాపకులు డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, భరత్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి

కలశాలను తీసుకొస్తున్న మహిళలు

పామిడి : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో వాసవీమాత జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాత్ణకాల అభిషేకాలు, పూజలు, అర్చనలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని శోభాయమానంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. వాసవీ మాతృ మండలి సభ్యులు అమ్మవారి కలశాలను తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఉపేంద్ర, గౌరవాధ్యక్షులు బి.వి.రత్నమయ్య, కె.సాయిప్రకాష్, కె.విశ్వనాథ్, నారాయణమూర్తి, శివరంగయ్య, నల్లయ్య, నాగార్జున, తదితరులు, పాల్గొన్నారు.

అదనపు పోలీస్‌స్టేషన్లు ఏవీ..?

ప్రతిపాదనలకే పరిమితమైన ఫైళ్లు
గుత్తి ఏరియాలో పెరిగిన చోరీలు
మితిమీరిన ట్రాఫిక్-ప్రజల ఇబ్బందులు

గుత్తి పోలీస్‌స్టేషన్

ప్రజాశక్తి-గుత్తి

మండలంలో గ్రామీణ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితయ్యాయి. 20 ఏళ్ల నుంచి గ్రామీణ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే ప్రభుత్వాలు మారుతున్నా వాటిని ఏర్పాటు చేయటంలో జాప్యం జరుగుతూనే ఉంది. ఇక్కడి అధికారులు అదనపు పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. గుత్తిలో ఒకే పోలీసుస్టేషన్ ఉండగా సిఐ ఎం.వెంకటరామిరెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎస్ఐలు బి.నబి రసూల్, ఆయేషాబేగం పని చేస్తున్నారు. ముగ్గురు ఏఎస్ఐలు, 9 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 20 మంది కానిస్టేబుళ్లు, నలుగురు మహిళా కానిస్టేబుళ్లు, పదిమంది హోంగార్డులు ఉన్నారు. వారే శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ పనులు చేయాల్సి ఉంది. గుత్తి మున్సిపాలిటీలో 55 వేల జనాభా ఉంది. మండలవ్యాప్తంగా 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే పోలీసు స్టేషన్ ఉండటంతో నేరాలు ఇటీవల మరింతగా పెరిగాయి. స్థానిక పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల చోరీలు అధికమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని పత్తికొండ రోడ్డు రైల్వే వంతెన వద్ద, మండలంలోని కొత్తపేట, కరిడికొండ గ్రామ సమీపాల మధ్య గత ఏడాది ఫిబ్రవరి 20 తేదీన దారి దోపిడీలు జరిగాయి. లారీ డ్రైవర్లపై దాడిచేస్తూ నగదు, సెల్ ఫోన్లను దుండగులు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. వీటికితోడు గుత్తిలో నాలుగు జాతీయ రహదారులు ఉన్నాయి. గుత్తి-అంకోలా, గుత్తి-అనంతపురం, గుత్తి-నెల్లూరు, గుత్తి-కర్నూలు వంటి రహదారులు ఉన్నాయి. వీటిలో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. అలాగే గుత్తిలో వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. రోజూ నాలుగు జాతీయ రహదారుల్లో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా పోలీసులు లేరు. శాంతిభద్రతలను పర్యవేక్షించే పోలీసులే ట్రాఫిక్‌ను చూసుకోవాల్సి ఉంది. కానిస్టేబుళ్లు, హోంగార్డులు ట్రాఫిక్‌ను అరకొరగా నియంత్రిస్తుంటారు. ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.ప్రధాన రహదారుల పక్కనే పాఠశాలలు, వసతి గృహాలు ఉన్నాయి. పెరుగుతున్న ట్రాఫిక్ విద్యార్థులు, ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గ్రామీణ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

బాబ (పాతచిత్రం)

గుత్తి : మండలంలోని తురకపల్లి గ్రామ సమీపంలో ఉన్న రైల్వే వంతెన వద్ద శనివారం ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ కానిస్టేబుళ్ల తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని పైమాల వీధికి చెందిన పి.బాబు (37) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధను భరించలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న జీఆర్పీ కానిస్టేబుళ్ల వాసు, నాగరాజు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం

చికిత్స పొందుతున్న అబ్దుల్లా

గుంతకల్లు : పట్టణంలోని దోనిముక్కల కాలనీలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ దూదేకుల అబ్దుల్లాపై శనివారం హత్యాయత్నం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని దోనిముక్కల కాలనీలో నివాసముంటున్న అబ్దుల్లా ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అదేకాలనీలో నివాసం ఉంటున్న షేక్షావలి టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో శనివారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఆటోస్టాండులో ఉన్న అబ్దుల్లా (30) వద్దకు వచ్చిన స్నేహితుడు చాంద్‌బాషా వచ్చి ఉన్నఫళంగా పదునైన కత్తితో పొట్టపై, ఛాతీపై పొడిచి పారిపోయాడు. పొట్టపై పొడిచి చీల్చడంతో పేగులు బయటికి వచ్చాయి. రక్తపు మడుగులో పడి ఉన్న అతడిని స్థానికులు వెంటనే ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సమాచారాన్ని పోలీసులకు అందించారు. వెంటనే రూరల్ ఎస్ఐ సురేష్, టూటౌన్ పోలీసులు హత్యాయత్నం జరిగిన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రికి చేరుకుని అబ్దుల్లా పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జిల్లాకేంద్రంలోని కిమ్స్ సవేరా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అక్రమ సంబంధం నేపథ్యంలోనే హత్యాయత్నం జరిగిందని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లుగా తెలుస్తోంది.

ఆ కుటుంబానికి 'గుండె'కోత..!

ఒకే కుటుంబంలో ఐదుగురు చిన్నారులకు సమస్య-ఆపన్నహస్తం అందించిన 'అమ్మ'

ప్రజాశక్తి-అనంతపురం

చెక్కులు అందజేస్తున్న అమ్మ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రమణారెడ్డి

ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఓ కుటుంబంలో ఏకంగా ఐదుగురు చిన్నారులకు గుండె సమస్య తలెత్తింది. జన్నుపరమైన సమస్యల కారణంగా కుటుంబంలో ఐదుగురికి గుండె సంబంధిత వ్యాధి సంక్రమించింది. శస్త్ర చికిత్స ఒకటే మార్గంగా ఉన్నా, కనీసం మందులు కొనలేని పరిస్థితిలో కుటుంబం ఉంది. ఈ విషయం తెలుసుకున్న అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తరిమెల రమణారెడ్డి తానున్నానంటూ చిన్నారుల గుండెకు రక్షణగా నిలిచారు. అవసరమైన వైద్యం ఖర్చులు అందించడంతోపాటు పూట గడవని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

వివరాల్లోకి వెళితే.. అనంతపురంలోని హమాలీ కాలనీలో నివసిస్తున్న నరసింహులు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇతనికి భార్యతోపాట ఆరుగురు సంతానం ఉన్నారు. వీరిలో ఐదుగురు చిన్నారులు గుండె సమస్యతో బాధపడుతున్నారు. ఈనేపథ్యంలో బెంగుళూరు నారాయణ హృదయాలయ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయగా చిన్నారుల గుండెల్లో రంధ్రాలు ఉన్నాయని చెప్పారు. జన్యుపరమైన గుండె సంబంధిత వ్యాధి అని, ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఇందుకు ఒక్కొక్కరికి సుమారు రూ.1.5లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. మొత్తం ఐదుగురు చిన్నారులకు సుమార రూ.7.50లక్షలు అవసమవుతుంది.

ఓవైపు ఆర్థిక పరిస్థితి.. మరోవైపు కుటుంబ పోషణ భారమైన నేపథ్యంలో పిల్లలకు మెరుగైన వైద్యం అందించలేని దుస్థితి. ఈ సమయంలో తమకు తెలిసిన వారు చెప్పిన సమాచారం మేరకు నగరంలో ఉన్న అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డిని ఆశ్రయించారు. వెంటనే స్పందించిన రమణారెడ్డి పిల్లల వైద్యం నిమిత్తం ఆపరేషన్‌కు కావాల్సిన రూ.7.50లక్షల చెక్కును అందజేశారు. అంతేగాకుండా తర్వాత ఖర్చులు, రవాణా సౌకర్యం మరో రూ.50వేలు అందించారు. భవిష్యత్తులో పిల్లలకు అవరమైన మందులు, విద్యకు సాయం అందచేస్తానని భరోసా ఇచ్చారు. అడిగిన వెంటనే స్పందించి తమ పిల్లల ప్రాణాలు కాపాడిన అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డికి నరసింహులు కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుత్తి

ఖైదీలతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న న్యాయమూర్తి శ్రీనివాసులు

ఖైదీలు సత్ ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు సూచించారు. శనివారం పట్టణంలోని ప్రత్యేక ఉపకారాగారాన్ని న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జైలు వద్ద ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కారాగారం పరిసరాలు, వంటగదిలో ఖైదీల కోసం తయారు చేసిన ఆహారం, స్టోర్ గది, మరుగుదొడ్లను పరిశీలించారు. తర్వాత సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అని ఖైదీలను అడిగారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ జైలు నుంచి విడుదలైన తర్వాత నేరాలకు పాల్పడకుండా కష్టపడి పని చేసి కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, బార్ అసోసియేషన్ ఇన్‌ఛార్జి అధ్యక్షుడు పీడీ రత్నం, న్యాయవాదులు గంగాధర్ కుమార్, ఎ.సూర్యనారాయణ, షఫీవుల్లా, టైపిస్ట్ సాదిక్‌వలి, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నార్పల : మండల పరిధిలోని శిద్ధరాచర్ల గ్రామ పంచాయతీలో ఉన్న గొల్లపల్లి ఆర్‌డిటి పాఠశాల ప్రాంగణంలో సర్పంచి సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి సహకారంతో శనివారం ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురికి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఇటీవల మనం తినే ఆహారం, మానసిక ఒత్తిళ్ల కారణంగా ఎక్కువమంది గుండె జబ్బులతో గురవుతున్నారన్నారు. కావన ప్రతి ఒక్కరూ గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలన్నార. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది పృథ్వీ ఏకాంత, గోపాలమిత్ర నరసప్ప, ఆశా అంజలి, గ్రామస్తులు శంకర, పెద్ద గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

బెలుగుప్ప : మండల పరిధిలోని గంగవరం గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ సుబ్బరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే సచివాలయం కార్యాలయ చుట్టూ తిప్పకుండా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. తర్వాత రెండు రోజులు కురిసిన వర్షానికి ఎక్కడపడితే అక్కడ నీరు నిల్వ ఉండడంతో దోమలు కాటుకు గురై అనారోగ్యం పాలవుతున్నామని ఎస్సీ కాలనీలో విన్నవించుకున్నారు. వెంటనే మురికి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి మాధవరెడ్డి, పంచాయతీ సెక్రటరీ జగదీష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చరణ్‌తేజ్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ హేమంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మురుగును పరిశీలిస్తున్న ఎంపిడిఒ సుబ్బరాజు, అధికారులు

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బెళుగుప్ప : మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వరశ్వర స్వామి ఆశ్రమంలో వెలిసిన వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా ఉదయం వీరబ్రహ్మేంద్రస్వామికి గణపతి పూజ, స్వస్తి పుణ్యవచనం, నవగ్రహ పూజ, ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి స్వామి శిష్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేసినట్లు పీఠాధిపతి ఈశ్వర స్వామి తెలిపారు. సాయంత్రం వీరబ్రహ్మేంద్ర స్వామిని పూలతో అలంకరించిన రథంపై కొలువుదీర్చి పురవీధుల గుండా ఊరేగించారు.

శింగనమల : మండల కేంద్రంలోని పాత మరవ వద్ద వెలసిన గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

గిరిబాబును పరామర్శిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు : అనారోగ్యానికి గురైన విడపనకల్లుకు చెందిన గిరిబాబును మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన గిరిబాబు అనంతపురంలోని సన్‌రే ఆసుపత్రికిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న విశ్వేశ్వరరెడ్డి శనివారం ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. అనంతరం వైద్యులను అడిగి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందజేయాలని వైద్యులకు సూచించారు.

వైభవంగా శ్రీవారి పల్లకిసేవ

పల్లకిసేవ నిర్వహిస్తున్న అర్చకులు

వజ్రకరూరు : ఉరవకొండ మండల పరిధిలోని పెన్నాఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలవుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీ నెగిటివ్ రక్తదానం

రక్తదానం చేస్తున్న సుధాకర్

వజ్రకరూరు : అనంతపురం జిల్లా రొద్దం మండలానికి చెందిన కె.ముత్తప్పకు గుండెకు సంబంధించిన ఆపరేషన్ కోసం ఎబి నెగిటవ్ రక్తం అవసరం కాగా అపద్బాంధవ ట్రస్ట్ వారిని సంప్రదించగా ట్రస్టు టీం స్పందిస్తూ ఉరవకొండ మండలంలోని రేణుమాకుల పల్లి గ్రామానికి చెందిన ట్రస్ట సభ్యుడు సుధాకర్‌కు తెలిజేయగానే హుటాహుటిన వెళ్లి రక్తదానం చేశారు. అనంతపురంలోని శ్రీచైతన్య బ్లడ్‌బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేయడంతో ముత్తయ్య కుటుంబ సభ్యులు సుధాకర్‌తోపాట అపద్బాంధవ ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

సినీనటుడు శ్రీకాంత్ పర్యటన వాయిదా

అనంతపురం : సినీనటుడు శ్రీకాంత్ అనంతపురం పర్యటన వాయిదా పడింది. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీనివాస్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రేయాస్ గ్రాండ్ లగ్జరీ రూమ్స్ అండ్ బ్యాంకెట్స్ నూతన షోరూమ్‌ను హీరో శ్రీకాంత్ 19న లాంచనంగా ప్రారంభిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపిన విషయం విధితమే. అయితే ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున శ్రీకాంత్ పర్యటన రద్దు అయినట్లు శ్రేయాస్ గ్రాండ్ సంస్థ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

మండలానికి చేరిన విత్తన వేరుశనగ

పామిడి : ఖరీఫ్‌లో రైతులకు సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగ కాయలు శనివారం మండలంలోని ఆర్‌బికెలకు చేరినట్లు ఎఒ లీలా వసుంధర ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో రైతులకు అందించేందుకు 1600 క్వింటాళు అవసరమని నివేదికలు పంపగా ఇప్పటి వరకూ ఎద్దులపల్లి, రామగిరి, పాళ్యం ఆర్‌బికెలక 300 క్వింటాళ్ల విత్తన వేరుశనగ వచ్చాయన్నారు. అలాగే మండలంలో మిగిలిన విత్తనకాయలు త్వరలోనే వస్తాయన్నారు.

22 వరకు ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు

పుట్లూరు : పుట్లూరు ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వతేదీ వరకూ గడువు ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపార. 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అన్నారు. ఆదర్శ కళాశాలలో మంచి నడవడిక, ప్రవర్తన, విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.

వేరుశనగ రిజిస్ట్రేషన్ వేగవంతం

మండల వ్యవసాయ అధికారి చెన్నయ్య

ప్రజాశక్తి-వజ్రకరూరు

రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి చెన్నయ్య

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నట్లు విడపనకల్, ఉరవకొండ మండలాల వ్యవసాయ అధికారులు పెన్నయ్య, శుభకర్ తెలిపారు. శనివారం చీకులగురికి, పాల్తూరు గ్రామాల్లో చేపట్టిన రైతుల వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విడపనకల్ మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. 30 కిలోల బ్యాగు పూర్తి ధర రూ.2850 కాగా సబ్సిడీ పోనూ రూ.1140 రైతు కట్టాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా పచ్చిరొట్ట ఎరువులు విత్తనాలు, పిల్లి పెసర విత్తనాలు కూడా సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బొమ్మనహాల్ : విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని ఆర్‌బికె కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనకాయలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నెంబర్‌తో వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

గుంతకల్లు : మండలవ్యాప్తంగా ఈనెల 24వ తేదీ నుంచి అర్హులైన రైతులందరికీ విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి కె.స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనకాయలు కావాల్సిన రైతులు ఆయా ఆర్‌బికెల్లో పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

సీలింగ్ ఫ్యాన్లు వితరణ

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం గ్రంథాలయానికి దాతలు రమేష్, ఆంజనేయులు రెండు సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేసినట్లు గ్రంథాలయాధికారి ప్రతాపరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేసవి శిక్షణ తరగతులు

శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో 4వరోజు శనివారం సంస్థ కార్యదర్శి రమ మేడం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగాయి. ఇందులో భాగంగా యోగాలో వెంకటేశప్ప, డ్రాయింగ్‌లో హర్ష అనిల్, స్టోరీ టెల్లింగ్‌లో మహేష్, మధు శిక్షణ ఇచ్చారు. అలాగే విద్యా విజ్ఞానం గురించి విశ్రాంత హెచ్ఎం వజ్రశాస్త్రి వివరించారు. అలాగే విశ్రాంత హెచ్ఎం సూర్యనారాయణ తెలుగు పద్యాలను పాటల రూపంలో అర్థాలను తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకు అధికారి సంపత్ జమార్ విద్యార్థులకు నీతికథలు చెప్పారు. అనంతరం విద్యార్థులను ఆర్కియాలజీ యూజియానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కావేరి, ఉజ్జినేస్వరి, ముత్యాలమ్మ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

(TO WHOM SO EVER IT MAY CONCERN)

This is to inform through public notice that I G.LAKSHMI is here by changing my name as **G.Adinarasamma (Aadhar No: 517706378371)**

PUBLIC NOTICE

This Public Notice is hereby given on behalf of my client REPCO Home Finance Limited, Anantapuramu that one Smt. Pathar Dehlij Mubarak Banu, W/o Pathar Dehlij Mohammad Imran, residing at Door No.17-1-196-7, Venugopal Nagar, Anantapuramu City and District, approach my client's company REPCO Home Finance Limited, Anantapuramu for going to Mortgage the below mentioned property as security by way of Regd. Mortgage the Original Regd. Sale Deed dt.28.03.2019 with Doc.No.4076/2019 and Regd. Rectification Deed dt.15.12.2023 with Doc.No.13906/2023, if any one has claims objections shall be informed to the below mentioned address or my client company's REPCO Home Finance Limited, Anantapuramu with in 7 days from the date of this public notice, otherwise the loan will be sanctioned treating that there are no objections to sanction loan on the security of the schedule property.

SCHEDULE OF THE PROPERTY

Property situated in R.D. and S.R.D. of Anantapuramu within the limits of Anantapuramu Municipal Corporation limits with the following description.

Nature	Sy.No.	A.C.	A.C.
Govt. Dry	214/2	0.43 paiki after leaving for road	0.33
Govt. Dry	214/3	0.43 paiki after leaving for road	0.38.75
Govt. Dry	215/4	0.84 paiki	0.04.75
			Total :0.76.50 paiki

Ac.0.03.39 cents **H.S. 0.015** **Plot No.21**

Bounded by: East : 20 feet Road; South: Plot No.22; West : Open site in the Sy.No.214/2; North : Plot No.20.

In between measuring: East-West on Southern side: 58 feet or 17.68 mtrs., East-West on Northern side: 58 feet or 17.68 mtrs., North-South on Eastern side: 25 feet or 7.62 mtrs., North-South on Western side: 26 feet or 9.93 mtrs.,

Total Extent: 164.33 Sq. Yards

P.SARATH BABU, Advocate,
Anantapuramu. Mobile: 944050855, 8639444475

భవితవ్యం నిక్షిప్తం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకు ఒకసారి ప్రజలు తమ పాలకులను ఎన్నుకుంటుంటారు. గడిచిన ఐదేళ్లలో పాలకుల పని తీరుకు ఇది పరీక్షతోపాటు, రాబోయే ఐదేళ్ల పాలన ఏరకంగా ఉండాలని నిర్ణయించేందుకు ఎంచుకున్న మార్గం ఈ ఓటింగు పద్ధతి. గతవారంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పూర్తయ్యాయి. ప్రజలు భవిష్యత్తుపై అనేక ఆకాంక్షలతో తమ అభిప్రాయాలను ఓట్లరూపంలో తెలియజేశారు. ఈనెల 13న ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్దఎత్తునే పోలింగ్ జరిగింది. ప్రజలు ఎంతో ఉత్సహంతో తమ అభిప్రాయాలను ఓటురూపంలో తెలియజేశారు. అయితే తీర్పు వెలువడాల్సి ఉంది. ఇందుకోసం మరో రెండు వారాలు వేచి చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో తక్కిన మూడు విడతల ఎన్నికలు పూర్తయిన తర్వాత ఒకేసారి ఓట్ల లెక్కింపు ఉంటుంది. అంతవరకూ ప్రజా తీర్పు ఇవిఎం యంత్రాల్లో నిక్షిప్తమై ఉంటుంది. ఓటింగ్ సజావుగా పూర్తయినప్పటికీ ఆ రోజు నుంచి తాడిపత్రి లో వైసిపి, టిడిపి వర్గీయుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ మంటలు ఇప్పటికీ చల్లారలేదు. మూడు రోజులుగా వరుసగా రెండు గ్రూపుల మధ్య యుద్ధ వాతావరణమే చోటు చేసుకుంది. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ కావడంతో అనంతపురం జిల్లా ఎస్పీపై సస్పెన్షన్ వేటు కూడా పడింది. ఈయనతోపాటు డీఎస్పీ, సిఐలు ఇతర అధికారులపైనా ఎన్నికల సంఘం వేటు వేసింది. ఇంతటితోనే ఆగకుండా బాధ్యులైన వారు తేల్చి వారిపైనా కేసులు నమోదు చేయాలని ఆదేశించడం పెద్ద చర్చనీయాంశం అవుతోంది. ఇప్పటికే ముఖ్య నేతలనూ స్థానికంగా లేకుండా బయటి ప్రాంతాలకు పంపారు. అలాగే కేంద్ర భద్రతా బలగాలు కూడా తాడిపత్రికి విచ్చేశాయి. ఈ బలగాలు ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత కూడా ఇక్కడే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇకపోతే ఎన్నికల వేడితోపాటు వాతవరణం వేడి తగ్గుముఖం పట్టింది. ఉమ్మడి జిల్లాలో ఈవారంలో అక్కడక్కడ వర్షాలు పడటమే ఇందుకు కారణం. దీంతో అంతకమునుపు వరకూ 43 డిగ్రీ వరకూ ఉన్న ఉష్ణోగ్రత ఇపుడు 38లోపు ఉంటోంది. 15 రోజుల తర్వాత ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు వర్షాలు పడుతుండటంతో రైతుల్లో ఉత్సహాన్ని నింపుతోంది. దీంతో సాగుకు సమయత్తమవుతున్నారు. తొలకరి వర్షాలకు పొలాలను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. ప్రభుత్వం కూడా సబ్సిడీ విత్తన పంపిణీకి రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టింది. మే 24 నుంచి జిల్లాలో వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తామని ప్రకటించడంతో శనివారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే వారంలోనూ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో రాబోయే ఖరీఫ్‌పై రైతుల్లో ఆశలు మొలుకెత్తుతున్నాయి. గతేడాది వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారైనా మంచి వర్షాలు పడి పంటలు పండితే బాగుంటుందని రైతులు ఆశిస్తున్నారు.